వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం



ప్రజారోగ్య పరిరక్షణకు అహర్నిశలూ శ్రమిస్తున్న వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం. దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దాడులు చోటుచేసుకున్నాక స్పందించేకన్నా, జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మహిళల భద్రతకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మహిళ ఉద్యోగులకు అవసరమైన టాయిలెట్లు, డ్రెస్ మార్చుకునే రూమ్‌లను అందుబాటులో ఉంచాలి. ఆయా ప్రాంతాల్లో భద్రత కల్పించాలి

– గంద్రపు దీప్తి, స్టాఫ్ నర్స్



నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా అత్యాచార ఘటన పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి. ఉన్న చట్టాలను సమర్థంగా అమలు చేయాలి. మరో మారు ఇటువంటి ఘటనలు చేసేందుకు కూడా భయపడే విధంగా శిక్షలు ఉండాలి. వైద్య సిబ్బందికి అదనపు భద్రత కల్పించాలి, రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో ఉన్న రక్షణ వ్యవస్థపై సమీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలి

– డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణయాదవ్, డెంటిస్ట్

నిర్వహణ లోపం.. పార్కుకు శాపం

- కళావిహీనంగా అల్లూరి సీతారామరాజు పార్కు
- కంకర, ఇసుక నిల్వల కేంద్రంగా మార్చిన అక్రమార్కులు
- పట్టించుకోని నగరపాలకసంస్థ అధికారులు



జీఎస్ రాజురోడ్డులోని అల్లూరి సీతారామరాజు పార్కు



పార్కులో నిల్వచేసిన ఇసుక, కంకర

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఒకప్పుడు పచ్చని మొక్కలు, పిల్లలు ఆడుకునేందుకు రకరకాల పరికరాలు, పెద్దలు సేదతీరేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకర వాతావరణంతో అలరారిన అల్లూరి సీతారామరాజు పార్కు నేడు కళావిహీనంగా తయారైంది. సుమారు 35 ఏళ్లక్రితం జీఎస్ రాజురోడ్డు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఏలూరు కాలువ గట్టుపై ప్రజలకు అందుబాటులో ఉండేలా నగరపాలక సంస్థ ఈ పార్కు తీర్చిదిద్దింది. రోజూ ఉదయం, సాయంత్రం వృద్ధులు, మహిళలు పిల్లలతో ఈ పార్కుకు వచ్చి సేద తీరేవారు. క్రమేణా నిర్వహణ లోపంతో పార్కు శిథిలావస్థకు చేరుకుంది.

ఆక్రమణదారుల చెరలో పార్కు

నిర్వహణ లోపంతో పార్కుకు సందర్శకులు రావటం మానుకున్నారు. అదే అదనుగా కొందరు పార్కును హస్తగతం చేసుకుని తమ అవసరాలకు వినియోగించుకుటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు సైతం పార్కులోకి వెళ్లకుండా రెండు గేట్లకు తాళాలు వేసి తమ ఆధీనంలో ఉంచుకున్నారని పేర్కొన్నారు. గతంలో ఏర్పాటు చేసిన పిల్లల ఆటపరికరాలను సైతం తమ అవసరాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంగా పూర్తిగా తొలగించి పార్కులో ఒక మూలన పడేశారు.



పార్కులో మూలన పడేసిన ఆటపరికరాలు

డంపింగ్ కేంద్రంగా పార్కు

పార్కును స్వాధీనం చేసుకున్న తమ వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు. ఇసుక, కంకర, రబ్బిస్ తదితర భవన నిర్మాణ సామగ్రిని భారీగా డంప్ చేసి ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లినా నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి రాకపోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించి, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పార్కు పూర్వ వైభవానికి కృషిచేస్తా



జీఎస్ రాజురోడ్డులో ఒక పార్కు ఉందన్న సంగతే ప్రజలు మర్చిపోయే పరిస్థితి నెలకొంది. గతంలో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించిన పార్కు నేడు అక్రమార్కుల హస్తగతం కావడం బాధాకరం. అల్లూరి సీతారామరాజు పార్కుకు పూర్వవైభం తీసుకొచ్చేందుకు నా వంతు కృషిచేస్తున్నా. ఇక్కడి పరిస్థితిని నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. పార్కుకు సంబంధించిన ప్రతిపాదనలను కౌన్సిల్‌లో ప్రస్తావించా. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి పార్కుకు పూర్వవైభవం తీసుకొచ్చేందకు కృషిచేస్తా.

– శర్వాణిమూర్తి, 33వ డివిజన్ కార్పొరేటర్

మహాలక్ష్మికి 250 చీరలతో అలంకరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి 250 చీరలతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం అమ్మవారిని 250 చీరలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. చీరల అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ప్రధాన అర్చకులు నుదురుమాటి కృష్ణప్రసాద్‌శర్మ, రెంటచింతల కాశీవిశ్వనాథ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 30వ తేదీ శ్రావణ శుక్రవారం ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన, చండీహోమం, లక్ష్మీగణపతి హోమం జరుగుతాయని అర్చకులు తెలిపారు. సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు ఈ చీరలను అమ్మవారి ప్రసాదంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు మహా పూర్ణాహుతి అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ దుర్గాపురం సబ్ స్టేషన్ 11 కేవీ మ్యూజిక్ కాలేజీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్ ఈఈ బి.వి.సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తి రోడ్డు, బావాజీపేట, దుర్గాపురం, గాంధీనగర్, రామనగర్, రామకోటి మైదానం, నోరీ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్ఆర్ఆర్‌లో ఆధార్ సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ అప్‌డేట్ సేవలు అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో పాటు స్థానికులకు ఆధార్ సేవలను కార్వే సిబ్బంది మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థుల కోసం రెండు రోజుల పాటు కార్వే సిబ్బంది సహకారంతో ఆధార్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. బుధవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ సేవలు అందుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్ పర్యవేక్షించారు.

రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటిన పీబీ సిద్ధార్థ విద్యార్థులు



విజయవాడస్పోర్ట్స్: తిరుపతి రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. బీకామ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వనం సింహాద్రి సీనియర్స్ విభాగంలో బంగారు పతకం, జూనియర్స్ విభాగంలో బీఎస్సీ రెండో సంవత్సరం విద్యార్థి ఠాగూర్‌సన్ని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. పోటీల అనంతరం జరిగిన రాష్ట్ర ఎంపిక పోటీల్లోనూ అద్భుతమైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ విద్యా సంస్థల ప్రతినిధులు డాక్టర్ సి.నాగేశ్వరరావు, పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి కాలేజీలో మంగళవారం విద్యార్థులను అభినందించారు.

వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి వ్యాయామ అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టంచేశారు. నెట్, స్లేట్, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి తొలి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లను కళాశాల ఆఫీసులో ఈ నెల 31వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా అందజేయాలని సూచించారు. సెప్టెంబర్ రెండో తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

హెల్మెట్‌పై అవగాహనకు పోలీసుల బైక్ ర్యాలీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీసీపీ టి.హరికృష్ణ సూచించారు. పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో వెస్ట్, నార్త్ జోన్ అధికారులు, సిబ్బంది హెల్మెట్‌పై అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ శివాలయం సెంటర్‌లో ప్రారంభమై చర్చి సెంటర్, స్వాతి సెంటర్ తిరిగి శివాలయం వద్దకు చేరుకుంది. డీసీపీ హరికృష్ణ, ఏసీపీ ఎం.రాజారావు హెల్మెట్ ధరించి స్వయంగా బైక్ నడిపారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ నుద్దేశించి డీసీపీ హరికృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలకు హెల్మెట్ లేకపోవడమూ కారణంగా తేలిందన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ర్యాలీలో నార్త్ ఏసీపీ రాజారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, నార్త్, వెస్ట్ జోన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

- 122 అంశాలతో అజెండా
- 20 అంశాలపై ప్రశ్నోత్తరాలు



నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో నగరంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మొత్తం 122 ప్రతిపాదనలు వచ్చాయి. 20 ప్రశ్నోత్తరాలపై సమావేశం జరగనుంది.

ప్రధాన అంశాలు ఇవీ..

- గతంలో హనుమాన్‌పేటలోని వీఎంసీ వెహికల్ డిపోలో వీఎంసీనే పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యలు చూసేది. మూడేళ్ల నుంచి అందులో కార్యకలాపాలు జరగడంలేదు. గతంలో మాదిరిగా పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- 34వ డివిజన్‌లో రైతుబజారు వెంబడి చెక్క పెట్టెలు తయారుచేసి విక్రయించే వ్యాపారులకు శాశ్వత ప్రాతిపదికన షెడ్లు నిర్మించి ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది.
- రెండో డివిజన్‌లో బెత్లెహేం నగర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం రోడ్డులో కొండ చివరి ప్రాంతంలో క్రాస్ రోడ్లు, డ్రెయిన్లు, మెట్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటి స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ కౌన్సిల్‌కు ప్రతిపాదించారు.
- నగరంలో కుక్కల బెడద అధికంగా ఉన్నందున వాటిని పట్టుకుని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్)కు తరలించేందుకు వీఎంసీకి ఒక్క వాహనం మాత్రమే ఉందని, ప్రతి సర్కిల్‌కు ఒక వాహనాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన వచ్చింది.
- నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వీధి విక్రయదారుల సర్వే నిర్వహించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌన్సిల్ ముందుకు ప్రతిపాదన వచ్చింది.

ప్రశ్నోత్తరాలు ఇవీ..

- 34వ డివిజన్‌లోని మ్యాంగో మార్కెట్‌లో ఉన్న షాపులు అన్నిటికీ ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయా? వారందరికీ కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం ఉందా? మ్యాంగో మార్కెట్ స్థలం కమర్షియల్‌గా ఉందా? రెసిడెన్షియల్‌గా ఉందా? అనే ప్రశ్నను 34వ డివిజన్ కార్పొరేటర్ బండి పుణ్యశీల కౌన్సిల్‌లో ప్రస్తావించనున్నారు.
- 2021 మార్చి నుచి 2024 జూన్ 31వ తేదీ వరకు వీఎంసీ ఎన్ని భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది? అనుమతి లేని ఎన్ని భవనాలను గుర్తించింది? ఎన్నింటిపై చర్యలు చేపట్టిందన్న ప్రశ్న చర్చకు రానుంది.

రెండు మిస్సింగ్ కేసులను ఛేదించిన పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రెండు మిస్సింగ్ కేసులను సింగ్‌నగర్ పోలీసులు ఛేదించారు. పోలీసుల కథనం మేరకు.. సింగ్‌నగర్ గంగానమ్మగుడి సమీపంలో నివసిస్తున్న ఎండీ సారాబీ(87) ఈ నెల 24వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సింగ్ నగర్ రామానగర్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు సోమవారం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన సింగ్‌నగర్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తప్పిపోయిన వృద్ధురాలు, ఇద్దరు పిల్లల ఆచూకీని గుర్తించి మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులను ఛేదించిన సీఐ కె.శివాజీ, ఎస్ఐ, సిబ్బందిని సీపీ రాజశేఖరబాబు, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

చిరంజీవి, నాగార్జునకు స్వరాంజలి



విజయవాడకల్చరల్: మహేశ్వరి ఇవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటులు చిరంజీవి, నాగార్జున జన్మదినం సందర్భంగా సినీ సంగీత విభావరి జరిగింది. గాయని మహేశ్వరి ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు నట వారసత్వాన్ని కాపాడుతున్న నటుడు అక్కినేని నాగార్జునని పేర్కొన్నారు. మహేశ్వరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని పద్మ భూషణ్ పురస్కారంతో సత్కరించిందని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రభల శ్రీనివాస్, ఎం.ఎస్.నారాయణ, రామభద్రకుమార్, జాస్తి సింధు తదితరులు పాల్గొన్నారు. అనూరాధ, మల్లీశ్వరి, ఉషారెడ్డి, ఉదయ భాను, షబానా వీరశేఖర్, రామభద్ర కుమార్ పలు గీతాలను ఆలపించారు.

రాయల్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందిజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాయల్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక ముత్యాలంపాడు అజయ్ స్కూల్‌లో మంగళవారం రాయల్స్ క్లబ్ ముత్యాలంపాడు ఆధ్వర్యాన మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీచేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో రాయల్స్ క్లబ్ తమదైన భూమిక పోషించాలని సూచించారు. రాయల్ క్లబ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ, పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ మిరియాల వెంకటేశ్వరరావు, చార్టర్ ప్రెసిడెంట్ రామిశెట్టి కొండలరావు, డాక్టర్ దవులూరి కైలాసరావు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా రాయల్స్ క్లబ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాయల్ క్లబ్ ముత్యాలంపాడు అధ్యక్ష, కార్యదర్శులు ఏపుగంటి సాయి కృష్ణ, వాసా ఆదినారాయణ, కోశాధికారి బి.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏసీపీ రాజారావు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రాజారావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నార్త్‌జోన్ ఏసీపీ ఎం.రాజారావు సూచించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ రాజారావు మాట్లాడుతూ.. రోజు రోజుకు టెక్నాలజీ మారుతున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేస్తే మొబైల్‌లోని డెటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఎస్ఎన్ పురం, ఏఎస్‌నగర్ సీఐలు బాల రాజాజీ, కె.శివాజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఏటీఏ ఎన్నికలు



రాజనాల వెంకట రమణారావు(బాజ్జి)



గంధం వెంకటేశ్వర రావు(కొండ)

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. 14 అనుబంధాలతో కూడిన బలమైన అసోసియేషన్ 1963లో ఏర్పడింది. మొట్టమొదటిగా ఈ అసోసియేషన్ ఎన్నికలు 1963 జూన్ 23వ తేదీన జరిగాయి. నాటి నుంచి నేటి వరకు పది సార్లు ఏటీఏ అధ్యక్ష ఎన్నికలను నిర్వహించారు. ఈ సంఘంలో మొత్తం 2,369 మంది కార్మిక ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు 2014 నుంచి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ఆయన సత్తా చాటారు. ఈ సారి కూడా రాజనాల వెంకటరమణారావు పోటీలో ఉన్నారు. ఈ సారి రాజనాలకు ప్రత్యర్థిగా గంధం వెంకటేశ్వరరావు (కొండా) అధ్యక్ష బరిలో నిలిచారు. వెంకటరమణారావుకు ఎన్నికల గుర్తు 2, వెంకటేశ్వరరావు ఎన్నికల గుర్తు 1. వారం రోజుల నుంచి వారిద్దరు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఏటీఏ ఎన్నికలు జరగనున్నాయి. సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. అసోసియేషన్‌కు ఇప్పటి వరకు పది సార్లు ఎన్నికలు జరగ్గా, మూడు సార్లు అధ్యక్షుడిగా గెలుపొందిన వ్యక్తి రాజనాల వెంకటరమణారావు ఒక్కరే.

దాసాంజనేయ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



దాసాంజనేయస్వామి ఆలయంలో పూజలు



శ్రీ కోదండ రామాలయంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామికి విశేషంగా తులసి అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసాంజనేయుడికి సిందూరం, ఆకుపూజలు జరిపించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

శ్రీ కోదండ రామాలయంలో..

ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డి.వి.ఎస్.రాజు, దాట్ల శివరామరాజు పర్యవేక్షించారు.

ఏపీ ఒలింపిక్ సంఘాన్ని ప్రక్షాళన చేస్తా

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

విజయవాడస్పోర్ట్స్: దొంగ రిజిస్ట్రేషన్లతో భ్రష్టుపట్టిన ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘాన్ని (ఏపీఓఏ) ప్రక్షాళన చేసేందుకు పూనుకున్నానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. ఏపీఓఏకు అనుసంధానంగా ఉన్న 34 క్రీడా సంఘాలు సైతం దొంగ రిజిస్ట్రేషన్‌తో కొనసాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్‌తో కలిసి ఎంపీ చిన్ని మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ సంఘంపై వచ్చిన ఫిర్యాదులపై ఎంపీ మాట్లాడుతూ.. క్రీడల్లో మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. దొంగ రిజిస్ట్రేషన్‌లతో పాటు సంఘంలో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయాలకు చోటు ఇవ్వకుండా రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి దిశగా నడిపించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు సూచించారు. రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్-3లో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం వర్క్‌షాపు జరిగింది. నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.దేవమణి, రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.నాగమణి, అంగన్‌వాడీ సెక్టార్ 1.2,3 విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రహస్య పర్యటనల ఆంతర్యమేమిటి?

బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయ్య యాదవ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ రహస్య పర్యటనల వివరాలను రాష్ట్ర ప్రజలకు బహిర్గతం చేయాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ గత వారంలో రెండు సార్లు రహస్యంగా విదేశీ పర్యటనలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వీటి వెనుక ఉన్న లావాదేవీలు ఏమిటో ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 23న సీఎం రాజమండ్రి, కోనసీమ జిల్లాల్లో పర్యటిస్తారని, అనంతరం నేరుగా రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళతారని సీఎంఓ అధికారులు ప్రకటించారని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా అదే 23న ముఖ్యమంత్రి చంద్రబాబు బెంగళూరు వెళ్లారని, ఇది రహస్యంగా జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రహస్యంగా పర్యటన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బెంగళూరు తాజ్ హోటల్‌లో ఎవరిని కలిశారు? అక్కడ రెండు గంటలపాటు ఎవరితో మంతనాలు జరిపారు అన్న విషయాలను బహిర్గతం చేయాలని బోడే రామచంద్ర యాదవ్ కోరారు.